సాక్షి
తిరుపతి
శుక్రవారం । 18 । జూలై । 2025



భానూ నోరు అదుపులో పెట్టుకో!

భానూ నోరు అదుపులో పెట్టుకో అని మాజీ మంత్రి ఆర్కే రోజా నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను హెచ్చరించారు. - 8లో



బది'లీలలు'.. సర్వేయర్లకు కష్టాలు

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో కూటమి నేతల సిఫార్సులకు పెద్దపీట వేయడంతో సర్వేయర్లు ఇబ్బందులు పడుతున్నారు. - 8లో



కుటుంబ కలహాలకు అ'బలి'

సహధర్మచారిణిపై అనుమానం.. కుటుంబ కలహాల కారణంగా భార్యాబిడ్డలను ఓ వ్యక్తి హతమార్చాడు. - 8లో

న్యూస్‌రీల్

సంజాయిషీ ఇవ్వకపోతే విధుల నుంచి తొలగిస్తాం

తిరుపతిసిటీ: శ్రీకాళహస్తి మండలంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఏ బాలకృష్ణ 2023 జనవరి 24వ తేదీ నుంచి నేటి వరకు విధులకు హాజరు కాకుండా అనుమతి తీసుకోకుండా వ్యవహరిస్తున్నారని డీఈఓ కేవీఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విధుల గైర్హాజరుపై ఎంఈఓ ద్వారా తాఖీదు నోటీసులు పోస్ట్ ద్వారా పంపామని తెలిపారు. కానీ ఆ ఉపాధ్యాయుడు ఆ నోటీసులను స్వీకరించకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. మూడు రోజుల్లోపు నోటీసులు స్వీకరించి, ఎంఈఓ కార్యాలయంలో హాజరై సంజాయిషీ ఇవ్వాలని, లేనిపక్షంలో విధుల నుంచి శాశ్వతంగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మరో ఇద్దరికి డెంగీ

సత్యవేడు: మండలంలోని ఏఎంపురంలో డెంగీ జ్వర పీడితుల సంఖ్య నాలుగుకు చేరడంతో రెండో రోజు దాసుకుప్పం వైద్యశాల సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. బుధవారం ఇద్దరికి డెంగీ సోకిన విషయం తెలిసిందే. కాగా గురువారం మరో రెండు కేసులు వెలుగు చూశాయి. దీంతో సర్పంచ్ శిరీష ఆధ్వర్యంలో మలేరియా ఆఫీసర్ రూప్‌కుమార్, సబ్ యూనిట్ అధికారి మోహన్, డాక్టర్ క్రిస్టల్‌దాస్, ఎంపీహెచ్‌ఈఓ గ్రామంలో పర్యటించి డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మలాథిన్ పిచికారీ చేశారు. డెంగీ జ్వర పీడితులు ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి, మునస్వామి యాదవ్, సాయి కుమార్, ఢిల్లీబాబుయాదవ్ పాల్గొన్నారు.

19 నుంచి మూడు రోజులు తపాలా సేవలు నిలిపివేత

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ప్రజలకు సంబంధించిన అన్ని లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ మేనేజర్ సయ్యద్ తన్వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునిక సాంకేతికను జోడించి పోస్టల్ సేవా కార్యాకలాపాలను మరింత మెరుగైన, వేగవంతమైన, సురక్షితంగా ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ఏపీటీ అప్లికేషన్‌ను తీసుకొస్తున్నట్లు తెలిపారు. డేటా మైగ్రేషన్, వ్యవస్థ ధ్రువీకరణలు, కాన్ఫిగరేషన్ ప్రక్రియలను సజావుగా నిర్వహించేందుకు తాత్కాలికంగా సేవలను రద్దు చేస్తున్నామని, తిరిగి ఈ నెల 22వ తేదీ నుంచి మెరుగుపరిచిన వ్యవస్థతో సేవా కార్యక్రమాలను పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు దీనిని గుర్తించి తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

31 వరకే హాస్టల్ అడ్మిషన్లు



భరత్‌కుమార్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్: జిల్లాలోని బీసీ హాస్టల్స్‌లో ఈ నెల 31 వరకు మాత్రమే అడ్మిషన్లు ఉంటాయని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ నుంచి మాట్లాడుతూ హాస్టళ్లలో చేరడానికి ఆసక్తి ఉన్నవారు మీ పరిధిలోని బీసీ హాస్టళ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 65 బీసీ హాస్టళ్లు ఉన్నాయని చెప్పారు. కొత్తగా చేర్చుకున్న విద్యార్థులతో కలిపి, ఇప్పటివరకు పాఠశాల, కళాశాల పరిధిలో 5,060 మంది విద్యార్థులున్నారని స్పష్టం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. నిత్యం హాస్టళ్లపై నిఘా పెట్టామని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన జిల్లాలోని అన్ని హాస్టళ్లలో విద్యార్థులతో వార్డెన్లు సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో విద్యార్థులు తాము ఉన్న హాస్టల్‌లో ఏదైనా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటే వెంటనే వార్డెన్ దృష్టికి తీసుకుపోతే వాటికి పరిష్కారం చూపించే దిశగా చర్యలు ఉంటాయని చెప్పారు.

సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 75,104 మంది స్వామివారిని దర్శించుకోగా 31,896 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

జననీ నిర్దయ యోజన

అమ్మతనం ఓ వరం.. ప్రసవం మహిళకు పునర్జన్మతో సమానం.. అయితే కూటమి సర్కారుకు పచ్చిబాలింతలన్న మానవత్వం, దయ, జాలి, కనికరం లేకపోయింది. తల్లీబిడ్డకు కేంద్రం అమలు చేసిన జననీ సురక్ష యోజన కింద ఇచ్చే ప్రోత్సాహకానికి తూట్లు పొడుస్తోంది. కేంద్రం వరమిచ్చినా.. రాష్ట్రానికి చేతులు రావడం లేదు. నిబంధనలు మార్చి..నమోదులో నిర్లక్ష్యం ప్రదర్శించి..కనికరం లేకుండా ప్రవరిస్తోంది. జననీ సురక్ష యోజన పథకాన్ని జననీ నిర్దయ యోజనగా మార్చింది.

- బాలింతలకు కరువైన కేంద్ర ఆర్థికసాయం
- లెక్కలోకి రాని వేలాది మంది తల్లులు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో కనిపించని దరఖాస్తులు
- సిబ్బంది కొరత, ప్రచార లోపమే కారణమా?

తిరుపతి రూరల్: కూటమి ప్రభుత్వం బాలింతలపై అలసత్వం ప్రదర్శిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అందించే జననీ సురక్ష యోజన సాయాన్ని కూడా లబ్ధిదారులకు చేర్చడంలో విఫలమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని బాలింతలకు అందించాల్సిన చేయూత గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వాస్పత్రిలో బాలింతల వివరాలు నమోదు చేయడానికి తగినంత సిబ్బంది లేకపోవడం, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవించిన వారి వివరాలు యాప్‌లో నమోదు కాకపోవడంతోనే బాలింతలకు కేంద్రం అందించే సాయం అందకపోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

మూడు విడతలుగా రూ.6 వేలు



ఒక మహిళకు గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు జన్మనిచ్చిన తరువాత కొంత కాలం వరకు మూడు పర్యాయాలుగా రూ.6 వేలు అందుతుండేది. గర్భ నిర్ధారణ అనంతరం తొలిగా రూ.వెయ్యి, ప్రసవ సమయంలో రూ.2,500, అనంతరం టీకాలు వేసే సమయంలో మిగిలిన రూ.2,500 ఇచ్చేవారు. తొలి, మలి ప్రసవాలకు ఈ ప్రోత్సాహక మొత్తాలను అందించేవారు. తెల్లరేషన్ కార్డు దారులైతే ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పు చేసుకున్నా సరే ఈ పథకాన్ని వర్తింపజేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవం చేసుకునే వారికి పథకాన్ని వర్తింప చేయడం లేదన్న వాదనలు క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి వినిపిస్తున్నాయి.

సిబ్బంది కొరత.. ప్రచారలోపం

బాలింతలకు అందాల్సిన కేంద్ర సాయం అందకపోవడానికి సిబ్బంది కొరత, ప్రచార లోపమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని కేంద్ర సాయాన్ని పేదలకు అందేలా చూడాల్సినప్పటికీ ఆ దిశగా దృష్టి పెట్టకపోవడం, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవం చేసుకున్న రేషన్ కార్డుదారులకు వర్తింపజేయకపోవడంతో వేలాది మంది బాలింతలకు అన్యాయం జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవించిన తల్లుల వివరాలు మాత్రమే ప్రభుత్వ యాప్‌లో నమోదు చేయడం, వారికి మాత్రమే బ్యాంకు ఖాతాల్లో దశల వారీగా డబ్బులు జమ చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రాణభయంతో ప్రసవం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే తెల్లరేషన్ కార్డుదారులకు కూడా ఈ పథకం వర్తింప చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాలే లక్ష్యం

మాతా శిశు మరణాలను తగ్గించాలనే సదుద్దేశంతో కేంద్రం అమలు చేస్తున్న జననీ సురక్ష యోజన పథకాన్ని ప్రధానమంత్రి మాతృ వందన యోజనతో జత కలిపారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనలో రూ.5 వేలు, జననీ సురక్ష యోజనలో మరో రూ.వెయ్యితో కలిపి మొత్తం రూ.6 వేలు లబ్ధిదారుకు అందజేస్తున్నారు. ఈ పథకంతో నివాసాల్లో జరిగే కాన్పులను పూర్తిగా నిర్మూలించి, ఆస్పత్రుల్లో మాత్రమే ప్రసవాలు జరగాలన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అలా చేయడంతో వైద్యుల పర్యవేక్షణతో తల్లీబిడ్డ, క్షేమంగా ఉంటారనే సంకల్పంతో ఈ పథకాన్ని కేంద్రం అమలులోకి తీసుకువచ్చింది.

కాగితాలకే పరిమితం

సంక్షేమ పథకమేదైనా పటిష్టంగా లబ్ధిదారులకు చేర్చినపుడే ఆ పథకం లక్ష్యం నెరవేరినట్లు అవుతుంది. అది కాగితాలకే పరిమితమైతే ఆ తప్పు అధికారులదే అవుతుంది. జననీ సురక్ష పథకం స్థితి అదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ పథకాన్ని జిల్లాలో అమలు చేయడంలో కూటమి పాలనలోని ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. పేద మహిళలకు ప్రసవాల సమయంలో ఊరటనివ్వలేక పోగా వారిని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేలా చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోంది.

జిల్లా సమాచారం



2024-2025 హెచ్‌ఎంఐఎస్ (హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)లో నమోదైన ప్రసవాల సంఖ్య **13,655**

లబ్ధి పొందిన బాలింతల సంఖ్య **13,069**

2025 -2026 హెచ్‌ఎంఐఎస్‌లో నమోదైన ప్రసవాలు **2,981**

లబ్ధిపొందిన బాలింతల సంఖ్య **2,764**

పడకేసిన సురక్ష యోజన

జననీ సురక్ష యోజన పల్లెల్లో పడకేసింది.. అమ్మలకు రక్షణ లేకుండా పోయింది. ఇందులో సాయం పేద కుటుంబాలకు మహిళలకు అందడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పులు చేసుకున్న వారు లెక్కల్లోకి రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దానికి కారణం అక్కడకు వెళ్లే వారి వివరాలును యాప్‌లోకి నమోదు చేయడానికి ప్రత్యేకించి సిబ్బంది లేకపోవడమేనని తెలుస్తోంది. ఈ పథకం అమలు తీరులో అస్పష్టతపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు పలుమార్లు ఆస్పత్రులకు తీసుకొచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పారా మెడికల్ సిబ్బందిదే కీలక పాత్ర ఉంటుంది. జననీ సురక్ష యోజన నిధులకు సంబంధించి గర్భిణులు, బాలింతల వివరాలను నమోదు చేయడంలో అవాంతరాలు చోటు చేసుకోవడం, పలు చోట్ల లబ్ధిదారు వివరాలు నమోదు చేసినా నగదు జమ కావడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య, ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బందిని అడిగితే వారి నుంచి సమాధానం రావడం లేదు.

గత ప్రభుత్వంలో ఎలా అమలు చేశారంటే..

గత ప్రభుత్వంలో జననీ సురక్ష యోజన పథకం ద్వారా గర్భిణులను ఇంటి నుంచి ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువెళ్లేవారు. గర్భిణులకు ఆస్పత్రుల్లో ఉచితంగా రక్త పరీక్షలు చేయడం, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో వీరికి చికిత్సలు అందించారు. గర్భం దాల్చిన సమయం నుంచి ప్రసవించే వరకు ఎప్పుడు రక్తం అవసరమైనా ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఎక్కించేవారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలోనే సాధారణ ప్రసవం, లేదా సిజేరియన్ చేసి, ఉచితంగా మందులు కూడా అందించేవారు. ఆస్పత్రి నుంచి బాలింత డిశ్చార్జ్ అయిన వెంటనే ఆమెను ఇంటికి 108 వాహనంలో తీసుకువెళ్లి వదిలిపెట్టేవారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపకరిస్తుంది. అయితే కూటమి సర్కారు దీనికి పూర్తి భిన్నంగా అమలు చేయడంతోపాటు కేంద్రం అందించే సాయాన్ని కూడా అందించలేని పరిస్థితికి తీసుకురావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాది గడిచినా డబ్బులు రాలేదు



నేను ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం చేసుకున్నాను. నాకు తెల్లరేషన్ కార్డు కూడా ఉంది. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు నా దగ్గర వివరాలన్నీ తీసుకుని ప్రభుత్వానికి పంపించామన్నారు. నా ప్రసవం జరిగి ఏడాదికిపైగా గడుస్తోంది. ఇప్పటివరకు జననీ సురక్ష యోజన పథకం కింద డబ్బులు రాలేదు. అదేమని అడిగితే ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తే నేరుగా బ్యాంకు అకౌంట్‌కే పడుతుందంటున్నారు. ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.

–శాంతి, అనుప్పల్లి, రామచంద్రాపురం మండలం

అడ్మిషన్ల లెక్క తప్పింది!

పాఠశాల విద్యపై కూటమి సర్కారు శీతకన్ను.. విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం.. పాఠ్యాంశ నిపుణుల కొరత.. ప్రత్యేక తరగతుల లేమి.. అందని స్టడీ మెటీరియల్.. వెరసి ఊహించని రీతిలో తల్లకిందులైన పది ఫలితాలు.. తారుమారైన ఇంటర్ అడ్మిషన్లు.. ఫలితం అడ్మిషన్ల లెక్క తప్పి.. ఇంటర్ విద్యాశాఖారులు తలలు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై ప్రత్యేక కథనం.

- ఇంటర్ అడ్మిషన్లపై పది ఫలితాల దెబ్బ
- పాఠశాల విద్యను నిర్వీర్యం చేసిన కూటమి సర్కారు
- పదిపై దృష్టి సారించక 8 శాతం తగ్గిన ఫలితాలు
- జిల్లాలో పడిపోయిన ఇంటర్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఏడాదిగా ప్రాథమిక, ఉన్నతవిద్యపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఆ ప్రభావం ప్రస్తుతం ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై పడింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది తిరుపతి జిల్లాలో పదో తరగతి ఫలితాలు 8 శాతం పడిపోయాయి. గత ఏడాది 75 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది కేవలం 67.06 శాతానికి పరిమితమయ్యాయి. దీంతో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు దారుణంగా పడిపోవడంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఇంటర్ విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలలో కనీసం సింగిల్ డిజిట్ అడ్మిషన్లు సైతం లేని కళాశాలలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అడ్మిషన్ల ప్రక్రియ గడువును పలుసార్లు పెంచుతున్నా మండల స్థాయిలోని హైస్కూల్ ప్లస్, మోడల్ స్కూళ్లలో ప్రవేశాలు ఒక్కటంటే ఒకటి కూడా జరగకపోవడం గమనార్హం. ఇందుకు ప్రధాన కారణం 2024-25 పదో తరగతి ఫలితాల దెబ్బేనని, ఇక ప్రవేశాలపై ఏమీ చేయలేమని అధికారులు నిర్మొహమాటంగా ప్రభుత్వానికి తేల్చిచెప్పినట్టు సమాచారం.

పాఠశాల విద్యను నిర్వీర్యం చేసిన కూటమి సర్కార్

తిరుపతి జిల్లాలోని 33 మండలాల్లో 323 ఉన్నత పాఠశాలలు ఉండగా 2024-25 సంవత్సరంలో పదో తగరతి పరీక్షలకు 26,875 మంది విద్యార్థులు హాజరు కాగా, ఉత్తీర్ణులైన వారి సంఖ్య 20 వేలకు మించకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. జిల్లాలోని సుమారు 75 శాతం పాఠశాలల్లో గత ఏడాది పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపకుండా తూతూ మంత్రంగా పాఠ్యాంశాలు బోధించి వదిలేశారు. దీనికితోడు ఆశించిన రీతిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందించలేకపోయారు. అలాగే ప్రధాన సబ్జెక్టులకు నిపుణులైన ఉపాధ్యాయుల కొరత సైతం ఫలితాలపై ప్రభావం చూపింది. విద్యాశాఖకాధికారులు పది విద్యార్థులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రభావం ఫలితాలపై చూపినట్లు విద్యావంతులు, నిపుణులు చర్చించుకుంటున్నారు.

4 వేల ప్రవేశాలపై ప్రభావం

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాలలో నేటికీ సుమారు 4 వేల సీట్లు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు విడతలోనూ 20 శాతం అడ్మిషన్లకు నోచుకోలేదు. అలాగే హైస్కూల్ ప్లస్, మోడల్, ఏపీఆర్‌జేసీ, ట్రెబల్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

కనీసం 25 శాతం అడ్మిషన్లు జరగకపోవడంతో విద్యాశాఖాధికారులు మరోసారి ఈనెలాఖరు వరకు అడ్మిషన్ల గడువును పెంచాల్సి వచ్చింది. అయినా ఇప్పటివరకు అన్ని ప్రభుత్వ కళాశాలలో సింగిల్ డిజిట్‌కు మించకపోవడం ఆశ్చర్యకరం. జిల్లాలో 109 ప్రైవేటు జూనియర్ కళాశాలు ఉండగా అందులో కేవలం 11 కళాశాలలో మాత్రమే ప్రవేశాలు 65 శాతం మేర జరిగాయి. మిగిలిన సాధారణ ప్రైవేటు కళాశాలలు మూత పడే పరిస్థితికి చేరుకుంటున్నాయి.




ఇంటర్మీడియట్ కళాశాలల్లో గత ఏడాది కంటే తగ్గిన అడ్మిషన్లు	4 వేలు
15 మంది కంటే తక్కువ అడ్మిషన్లు కలిగిన కళాశాలలు	18
సింగిల్ డిజిట్ అడ్మిషన్ల కళాశాలలు	5
50 శాతం అడ్మిషన్లు పొందిన ప్రైవేటు కళాశాలలు	15
25 శాతం కంటే తక్కువ ప్రవేశాలు పొందిన ప్రైవేటు కళాశాలలు	79

జిల్లా వివరాలు

- 2024-25లో పదోతరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు - 26,875
- ఉత్తీర్ణులై విద్యార్థులు - 20,597
- ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం - 79 శాతం
- గత ఏడాది ఉత్తీర్ణత శాతం - 90.71
- గత ఏడాది రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థానం - 10
- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ఉత్తీర్ణత శాతం - 10.88శాతం
- ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో పది ఫలితాల్లో జిల్లా స్థానం - 19

జిల్లాలో ఇంటర్మీడియట్ కళాశాలల వివరాలు	
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	21
ప్రైవేటు కళాశాలలు	109
హైస్కూల్ ప్లస్	29
మోడల్ స్కూళ్లు	5
ఏపీఆర్‌జేసీ	1
ఎయిడెడ్	1
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	10
ట్రైబల్ వెల్ఫేర్	3
ఎంజేపీఏఆర్‌బీసీడబ్ల్యూఆర్	2


ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



గత ఏడాది కంటే 2025-26 సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తాం. పదో తరగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఉపాధ్యాయుల కొరతను నివారించి అన్ని పాఠ్యాంశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వచ్చే ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

–కేవీఎస్ కుమార్, డీఈఓ, తిరుపతి జిల్లా

నెలాఖరు వరకు అడ్మిషన్లకు గడువు



జిల్లాలోని జూనియర్ కళాశాలలో ప్రవేశాలు కాస్త మందకొడిగా ఉన్నాయి. దీంతో ఈ నెలాఖరు వరకు అడ్మిషన్ల గడువును ప్రభుత్వం పెంచింది. విద్యార్థులు ప్రభుత్వం ఎంసెట్ వంటి పోటీపరీక్షల మెటీరియల్స్‌ను, పుస్తకాలను, నోట్‌బుక్స్‌ను అందిస్తోంది. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరడం ఉత్తమం. తల్లిదండ్రులు సైతం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

– జి రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐఓ, తిరుపతి జిల్లా

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో మెరిసిన తిరునగరి

- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మేయర్, కమిషనర్

తిరుపతి తుడా: కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా అందించే స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి నగరపాలక సంస్థ ఎంపికైంది. గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌తో కలసి తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్ మౌర్య అవార్డును అందుకున్నారు. మూడు లక్షల జనాభా కేటగిరీలో తిరుపతి నగర నగరపా లక సంస్థ సూపర్ స్వచ్ఛలీగ్‌ను కైవశం చేసుకుంది. పరిశుభ్రమైన పరిసరాల ద్వారా ఆరోగ్యకర సమాజం సాధించే లక్ష్యంతో ప్రధాని మోదీ రూపొందించిన స్వచ్ఛభారత్ విప్లవం కొనసాగుతోంది. ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో అవార్డులను ప్రకటిస్తూ మున్సి పాలిటీలు, కార్పొరేషన్లను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ అవార్డుకు ఎంపిక కావడంపై మేయర్, కమిషనర్‌తోపాటు పలువురు నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సి బ్బంది హర్షం వ్యక్తం చేశారు. మేయర్, కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది, నగర ప్రజలతోపాటు ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఈ అవార్డు సాధించగలిగామన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించగలుగుతామన్నారు.

అయ్యో.. అన్నంత పనీ చేసేశారు..!

- ఏఎన్‌ఎం అన్నపూర్ణ రామకుప్పంకు బదిలీ
- ఆ ఏఎన్‌ఎంపై ఎమ్మెల్యే నానికి ఎందుకంత కక్ష ?
- నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేసిన డీఎంహెచ్‌ఓ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అయ్యో.. అన్నంత పనీ చేసేశారు.. అందరికీ ఆరోగ్య సేవలు అందించే ఆ ఏఎన్‌ఎంపై ఎందుకు పగబట్టారు..? ఆమె చేసిన తప్పు ఏమిటో చెప్పలేదు..? ఆ విషయంలో జిల్లా అధికారులు కూడా స్పష్టత ఇవ్వలేదు.. ఏదైతేనేం.. వారు అనుకున్నట్టుగానే ఆ ఏఎన్‌ఎంను కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పంకు బదిలీ చేసేశారు. చంద్రగిరి మండలం మిట్టపాళెం గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న గట్టు అన్నపూర్ణ పదిమందికీ వైద్య సేవలు అందిచడంలో చాలా చురుగ్గా పని చేస్తుంటారు. ఆమె భర్త మైఖేల్ ఆర్టీసీలో ఉద్యోగి. వీరిద్దరూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కావడంతో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని పగబట్టారు. ఇటీవల జరిగిన ఏఎన్‌ఎంల బదిలీల్లో అన్నపూర్ణను చంద్రగిరి మండలం నుంచి కుప్పం నియోజకవర్గానికి బదిలీ చేయాలని డీఎంహెచ్‌ఓ సుధారాణిపై ఒత్తిడి తెచ్చారు. అయితే ఏఎన్‌ఎంల బదిలీ ఉత్తర్వులు ప్రకారం ఆమెను అంత దూరం బదిలీ చేయడానికి అవకాశం లేదన్న విషయాన్ని ఎమ్మెల్యే నానికి డీఎంహెచ్‌ఓ సుధారాణి తెలియపరిచినప్పటికీ పరిపాలనా సౌలభ్యం కింద ఆమెను కుప్పంకు బదిలీ చేయాల్సిందేనని పట్టుబట్టినట్టు సమాచారం. అదే విషయాన్ని డీఎంహెచ్‌ఓ ఏఎన్‌ఎం అన్నపూర్ణను పిలిచి చెప్పడంతో పాటు ఎమ్మెల్యే నానిని కలసి ఆయన వద్దనుంచి వద్దని చెప్పిస్తే తప్ప తాను ఏమీ చేయలేనని కూడా వివరించారు. ఎమ్మెల్యే నాని ఏఎన్‌ఎం బదిలీకి లక్ష రూపాయలు అడిగితే ఇవ్వనందుకు తనపై కక్ష కట్టి కుప్పానికి బదిలీ చేయమన్నారని ఏఎన్‌ఎం అన్నపూర్ణ గత నాలుగు రోజుల క్రితం మీడియాకు వివరించారు. దీంతో ఆమెపై మరింత కక్ష పెంచుకున్న ఎమ్మెల్యే నాని జనసంచారం తక్కువగా ఉండే అటవీ ప్రాంతానికి బదిలీ చేయాలని డీఎంహెచ్‌ఓకు మరోసారి ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. చివరకు జిల్లా అధికారులు ఏఎన్‌ఎం అన్నపూర్ణను తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నుంచి చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం 89 పెద్దూరు (అటవీ ప్రాంతం)కు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏఎన్‌ఎం అన్నపూర్ణపై కక్ష కట్టిన ఎమ్మెల్యే నాని తన పంతం నెగ్గించుకోవడం పట్ల ఉద్యోగసంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.



ఏఎన్‌ఎం అన్నపూర్ణ

మహిళా ఉద్యోగిపై అంత కక్ష ఎందుకో..?

ఒక మహిళా ఉద్యోగిని పట్ల ఎమ్మెల్యే నాని కక్ష కట్టడంపై స్థానికంగా మహిళా ఉద్యోగుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలే ఆరోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న అన్నపూర్ణ పట్ల ఎమ్మెల్యే నాని, జిల్లా అధికారులు అనుసరించిన తీరు సరిలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఎన్‌ఎంల బదిలీల్లో అడ్డగోలుగా వ్యవహరించారనడానికి చంద్రగిరి మండలంలో పనిచేసే పలువురు ఏఎన్‌ఎంలకు అదే మండలంలో పోస్టింగ్‌లు ఇవ్వడమే నిదర్శనమని అన్నపూర్ణ భర్త మైఖేల్ ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: సీఎం చంద్రబాబు ఈ నెల 19వ తేదీన తిరుపతి పర్యటన ఉన్న నేపథ్యంలో విమానాశ్రయంలో ముందస్తు ఏర్పాట్లపై గురువారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అధికారులతో సమీక్షించారు. సీఎం పర్యటనలో ఎటువంటి లోపాలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు జయచంద్ర, మంజునాథరెడ్డి, విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూను సందర్శించిన మాడభూషి



వర్సిటీలో అధికారులతో సమావేశమైన ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీని మాజీ ఇన్ఫర్మేషన్ కమిషనర్, ప్రస్తుతం మహీంద్ర యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా డీన్ మాడభూషి శ్రీధర్ గురువారం సందర్శించారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, పలు విభాగాల అధ్యాపకులతో సమావేశమయ్యారు. సంస్కృత అధ్యయనం, బోధన, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, యూజీ, పీజీ కోర్సుల నిర్వహణపై ఆరా తీశారు. యోగా విభాగంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ప్రతిభను ప్రత్యక్షంగా చూసి, అభినందించారు. సెంట్రల్ లైబ్రరీ, ల్యాబ్‌లను సందర్శించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృత జ్ఞానాన్ని, ఆధునిక పరిజ్ఞానం, టెక్నాలజీతో సమన్వయం చేసి ముందుకు వెళ్లడం అభినందనీయమన్నారు. ఆయనతో పాటు వర్సిటీ పీఆర్‌ఓ ప్రొఫెసర్ రమేష్ బాబు, ఏపీఆర్‌ఓ డాక్టర్ కనకాల కుమార్, డాక్టర్ మాధవరావు, డాక్టర్ శేఖర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రపంచ మామిడి దినోత్సవానికి తరలిరండి

తిరుపతి కల్చరల్: మామిడి రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రపంచ మామిడి దినోత్సవం కార్యక్రమానికి జిల్లాలోని రైతులందరూ తరలి వచ్చి జయప్రదం చేయాలని మామిడి రైతు సంక్షేమ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ టి.జనార్దన్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు పిలుపునిచ్చారు. గురువారం గంధమనేని శివయ్య భవన్‌లో వారు ప్రపంచ మామిడి దినోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సీజన్‌లో మామిడి రైతుల చేతికి అందిన పంట అమ్ముకోవడానికి పడిన కష్టాలు అలివకానివన్నారు.

భానూ నోరు అదుపులో పెట్టుకో!

- నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు మాజీ మంత్రి రోజా స్ట్రాంగ్ వార్నింగ్
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై తప్పుడు కేసుల బనాయింపుపై మండిపాటు



ఎమ్మెల్యే భానుకు వార్నింగ్ ఇస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: 'భాను నోరు అదుపులో పెట్టుకో.. తప్పుడు కూతలు కూస్తే తోలు తీస్తా' అంటూ మాజీ మంత్రి ఆర్కేరోజా నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక కేసులో నగరిలో పట్టుబడిన టీడీపీకి చెందిన వారిని వదిలి రాత్రికి రాత్రి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై అక్రమ కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు. నగరి కౌన్సిలర్లు బీడీభాస్కర్, బిలాల్‌ను బుధవారం అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసిన నగరి పోలీసులు, గురువారం పుత్తూరు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వీరికి 14 రోజులు రిమాండ్ విధించడంతో సత్యవేడు సబ్‌జైలుకు తరలించారు. విషయం తెలుసుకొని పుత్తూరు కోర్టు వద్దకు వచ్చిన మాజీ మంత్రి మీడియాతో మాట్లాడారు. నగరిలో ఇసుక అక్రమ రవాణా కేసులో పట్టుబడిన వారందరూ టీడీపీకి చెందిన వారని తెలిపారు. నగరి ఎమ్మెల్యే భానుకు ముఖ్య అనుచరుడైన భరత్ సైతం అరెస్టయిన వారిలో ఉన్నాడని ఆమె పేర్కొన్నారు.

అది సాధ్యపడేనా?

రాజంపేట నుంచి తిరుపతి మీదుగా నగరికి వచ్చిన టిప్పర్లు ఇక్కడ ఇసుకను డంపింగ్ చేసుకొని తమిళనాడుకు తరలించాలంటే అది వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్ల వల్ల జరిగే పనేనా అని మాజీ మంత్రి ప్రశ్నించారు. రాజంపేట, తిరుపతి, నగరిలో కూటమి ఎమ్మెల్యేలు ఉండగా మూడు జిల్లాలకు చెందిన ఎస్పీలు, కలెక్టర్లను, మైనింగ్ ఆఫీసర్లను మేనేజ్ చేయడం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు సాధ్యపడే పనేనా అంటూ ప్రశ్నించారు. ఎక్కడో లెక్కల్లో తేడా వచ్చి టిప్పర్లు పట్టుబడడం జరిగిందన్నారు. లెక్కలు సరిచేసుకొని మళ్లీ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెట్టారని ఆరోపించారు. ఇది ఎంతవరకు న్యాయమని ఆమె ప్రశ్నించారు.

వారు మాఫియాకు అధిపతులు

ఇసుక, గ్రానైట్, బియ్యం మాఫియాకు నగరి, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేలు అధిపతులుగా వ్యవహరిస్తున్నారని పత్రికలు, సోషల్ మీడియా కోడై కూస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నగరిలో గాలివాటంతో గెలిచిన గాలి భానుప్రకాష్ ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని చేయలేదని దుయ్యబట్టారు. ఇటీవల నగరిలోనే తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న 13 టన్నుల రేషన్ బియ్యాన్ని ఇక్కడి అధికారులే పట్టుకొన్నారని గుర్తుచేశారు. ఈ కేసులో అరెస్టయిన ప్రధాన సూత్రధారి అమృతరాజ్ నాడార్ ఎమ్మెల్యే భానుకు ప్రధాన అనుచరుడని తెలిపారు. భాను నుంచి ఫోన్ రావడంతో చిన్నపాటి కేసుతో వెంటనే విడుదల చేసేశారన్నారు. ఇందుకు సాక్ష్యంగా ఇటీవల అమృతరాజ్ నాడార్ ఎమ్మెల్యే భాను బర్త్‌డేకి ఓ పత్రికలో ఇచ్చిన ప్రధాన అడ్వర్‌టైజ్‌మెంట్‌ను చూపించారు.

ఇకపై ఉపేక్షించేది లేదు!

ఎమ్మెల్యే భానుకు రోజురోజుకు నోరు పెరిగిపోతోందని, ఇటీవల తనపట్ల తప్పుగా మాట్లాడిన విషయాలపై కేసు పెట్టడంతో పాటు డిఫమేషన్ సూట్ వేస్తున్నట్లు చెప్పారు. ఇక ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తన గురించి మాట్లాడడానికి భానుకు అర్హతే లేదన్నారు. రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, భాను తినే ప్రతి అవినీతి పైసా కక్కిస్తానని హెచ్చరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మంచి చేసిందని తెలిపారు. నేటి కూటమి ప్రభుత్వంలో ఒక్క ఏడాదిలోనే రూ.1.86 లక్షల కోట్ల అప్పుతీసుకొచ్చి చెత్త రికార్డు నెలకొల్పిన ఘనత చంద్రబాబునాయుడుకు దక్కిందన్నారు. నగరి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం రేపు

- ఐఐటీలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్పీ

ఏర్పేడు: మండలకేంద్రం సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో శనివారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన సందర్భంగా గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఐఐటీ ప్రాంగణంలోని రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ భవనాన్ని పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన ముందస్తు భద్రతా చర్యలను గురించి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా జేసీ శుభం బన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దార్ భార్గవి పాల్గొన్నారు.

బడగనపల్లిలో కూటమి నేతల దాష్టీకం..!

- వైఎస్ఆర్‌సీపీ సానుభూతిపరుల నిర్బంధం
- ప్రభుత్వ నిధులతో వేసిన దారి అడ్డగింత
- రాకపోకలు లేకుండా ఇనుప కంచె ఏర్పాటు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెల్లో రాజకీయ కక్షలు అంతకంతకు పెరుగుతున్నాయి.. నిన్న మొన్నటి వరకు భౌతిక దాడులకు తెగబడిన పచ్చమూకలు నేడు గృహ నిర్బంధాలకు పాల్పడుతున్నాయి. కూటమి పార్టీలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను గృహ నిర్బంధం చేసి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. పంచాయతీ నిధులతో గ్రామంలో వేసిన దారికి అడ్డుగా ఇనుప కంచెలను ఏర్పాటుచేసి రాకపోకలు లేకుండా చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో గత రెండు రోజులుగా ఓ కుటుంబం ఇంటి నుంచి బయటకు రాలేక తల్లడిల్లుతోంది. ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారిపల్లి పంచాయతీ బడగనపల్లి గ్రామంలో నివాసముంటున్న వెంకటరమణ, విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు భువనసాయి, కుమార్తె మనీషాతో కలసి అదే గ్రామంలో నివాసముంటున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సానుభూతిపరులుగా ఉంటున్న వెంకటరమణ కుటుంబంపై వారికి సమీప బంధువులైన చరణ్‌కుమార్, మంజుల, రాజేశ్వరమ్మ (జనసేన పార్టీకి చెందిన వారు) కక్ష కట్టారు. వెంకటరమణ పట్టా భూముల్లో చరణ్‌కుమార్ భూములకు వెళ్లడానికి దారి ఏర్పాటుకు ప్రయత్నించారు. తన పట్టా భూముల్లో దారి వేయడానికి వెంకటరమణ అంగీకరించలేదు. దీంతో గ్రామంలోని అతని ఇంటికి రాకపోకలు లేకుండా పంచాయతీ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డుపై ఇనుప కంచె ఏర్పాటు చేశారు. అంతేకాక వైఎస్ఆర్‌సీపీ సానుభూతిపరులైన వెంకటరమణ కుటుంబంపై కక్ష తీర్చుకోవడానికి ఇదే అదనుగా భావించిన గ్రామంలోని కొంతమంది టీడీపీ వర్గీయులు సైతం చరణ్‌కుమార్ కుటుంబీకులకు అండగా నిలిచారు. దీంతో వెంకటరమణ కుటుంబీకులు గత రెండు రోజులుగా ఇంటి నుంచి బయటకు రాలేక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు కాలేజీలకు వెళ్లాలన్నా, కనీసం పశువులకు వైద్యం చేయించుకోవాలన్నా దారి లేకపోవడంతో సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని మండలస్థాయి అధికారులకు తెలియపరచినప్పటికీ వారు స్పందించకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి ఆ కుటుంబానికి బయటకు వచ్చే అవకాశం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సాయం కోసం ఎదురుచూస్తున్న వెంకటరమణ కుటుంబీకులు



వెంకటరమణ ఇంటికి రాకపోకలు లేకుండా దారిని ఇనుప కంచెతో మూసివేసిన కూటమి నేతలు

బది'లీలలు'.. సర్వేయర్లకు కష్టాలు

- జిల్లాలోని 34 మంది సర్వేయర్లు చిత్తూరు జిల్లాకు బదిలీ
- జిల్లాలో ఖాళీ లేకపోవడంతోనే చిత్తూరుకు పంపినట్లు వెల్లడి
- జిల్లాలో 117 సర్వేయర్ పోస్టులు ఖాళీ
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న సర్వేయర్లు



జిల్లా సర్వేయర్‌ను కలవడానికి కలెక్టరేట్‌కు వచ్చిన సచివాలయ సర్వేయర్లు

తిరుపతి అర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల విషయంలో నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా అధికారులు వ్యవహరించారనే విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. తమకు అన్యాయం జరిగిందంటూ సచివాలయంలోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు నెల రోజులుగా గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయిందని పలువురు మండిపడుతున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా కూటమి నేతల సిఫార్సు మేరకు బదిలీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బదిలీల్లో చోటుచేసుకున్న అవకతవకలపై జిల్లా ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా.. వారు సీరియస్‌గా తీసుకోకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

34 మంది సర్వేయర్లు చిత్తూరు జిల్లాకు బదిలీ

సర్వేయర్ల బదిలీలకు సంబంధించి 34 మంది సచివాలయ సర్వేయర్లను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. దీంతో ఆ సర్వేయర్లు గురువారం కలెక్టరేట్‌లోని సర్వే విభాగం జిల్లా అధికారి అరుణ్ కుమార్‌ను ఒక్కొక్కరుగా కలిసి.. వారి ఆరోగ్య సమస్యలతోపాటు ఇతర సమస్యలను వెల్లడించారు. తమకు జిల్లాలోనే అవకాశం కల్పించాలని కోరారు. అయితే ఆయన మీచ్యువల్ బదిలీలు ఉంటే చూడండి చేద్దామని చెప్పడంతో వారంతా ఆ దిశగా అన్వేషణ చేస్తున్నారు. ఎవరైనా తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న సర్వేయర్ చిత్తూరు జిల్లాకు వెళ్లడానికి సుముఖంగా ఉంటే.. చిత్తూరు జిల్లాలోని మీ స్థానంలోకి వారిని పంపించి.. వారి స్థానంలోకి అవకాశం కల్పిస్తామని చెప్పడంతో అంతా ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 117 మంది సర్వేయర్ల కొరత

జిల్లాలోని సచివాలయాల్లో 491 మంది సచివాలయ సర్వేయర్ల ఉద్యోగాలు గతంలో మంజూరు చేశారు. అయితే 386 మంది పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. అందులోను 12 మంది సర్వేయర్లుకు మరో విభాగంలో కొత్తగా ఉద్యోగం రావడంతో వెళ్లిపోయారు. దీంతో మొత్తంగా 374 మంది సర్వేయర్లు మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో జిల్లాలో 117 మంది సర్వేయర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయకుండా ఖాళీలు లేవంటూ చిత్తూరు జిల్లాకు 34 మందిని బదిలీ చేశారు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

మ్యూచువల్ ఉంటే మార్పు చేస్తాం

సర్వేయర్ల బదిలీలకు సంబంధించి తిరుపతి జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు మ్యూచ్యువల్ ఉంటే తప్పకుండా బదిలీ చేస్తాం.. లేదంటే స్పష్టమైన ఆధారాలతో ఆనారోగ్య సమస్యలు ఉంటే మార్పు చేస్తాం. జిల్లాలో గతంలో 491 సచివాలయ సర్వేయర్ పోస్టులు మంజూరు చేశారు. అయితే 391 మంది మాత్రమే గతం నుంచి పనిచేస్తున్నారు. ఆ తర్వాత మరో 12 మంది నుంచి 14 మంది ఇతర ఉద్యోగాలు రావడంతోనే వెళ్లిపోయారు. తిరుపతి జిల్లా కన్నా చిత్తూరు జిల్లాలోనే అధికంగా సర్వేయర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాంతో చిత్తూరుకు కొందర్ని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహించిన సర్వేయర్ల కౌన్సెలింగ్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

–అరుణ్‌కుమార్, జిల్లా సర్వే విభాగం అధికారి

ప్రధానోపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు

తిరుపతి రూరల్ : మండలంలోని కేసీపేట పరిధిలోని మెడ్‌జీ స్కూల్ ఆవరణలో లీడర్‌షిప్‌పై ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న 916 మంది ప్రధానోపాధ్యాయులను మూడు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడత ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకరరావు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, ఎంఈఓ భాస్కర్‌బాబు, ఏఎస్‌ఓ సారథి, ఏపీఓ సుధాకర్, మాస్టర్ ఫెసిలిటేటర్లు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ల నియామకం

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పలు వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. చిత్తూరు– వయ్యాసి ఝాన్సీరాణి, గూడూరు – చిల్లకూరు సీరజ, పెనుమూరు– ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, రొంపిచెర్ల – కొండా సుజాత,సూళ్లూరుపేట – ఆకుతోట రమేష్, తిరుచానూరు – ఊరుబిండి మౌనిక, వాకాడు – మర్రి ప్రమీల, వెంకటగిరి – పునుగోటి విశ్వనాథ్, నాయుడుపేట – ఉయ్యాల ప్రవీణ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

టిప్పర్ బోల్తా

డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు



రింగ్ రోడ్డు బ్రిడ్జిపై నుంచి కింద పడిన టిప్పర్

నాయుడుపేట టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిలో ఉన్న రింగ్ రోడ్డు బ్రిడ్జిపై నుంచి టిప్పర్ గురువారం తెల్లవారు జామున అదుపు తప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న గూడూరు ప్రాంతానికి చెందిన డ్రైవర్ , క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గూడూరు నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న ఖాళీ టిప్పర్ నాయుడుపేట సమీపంలో 71 నంబర్ జాతీయ రహదారి రింగ్ రోడ్డు బ్రిడ్జిపైకి వచ్చేసరికి అదుపు తప్పి సుమారు 30 అడుగులకు పైనుంచి కింద పడిపోయింది. సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని టిప్పర్ క్యాబిన్‌లో ఇరుక్కొన్న డ్రైవర్ ఎం హరి, క్లీనర్ ఎస్ వెంకటేశ్వర్లు బయటకు తీసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలకు అ'బలి'

- భార్యాబిడ్డలను బావిలో తోసి చంపేశాడు!
- కుటుంబ కలహాలే కారణం అంటున్న స్థానికులు



పోలీసులు అదుపులో నిందితుడు గిరి



హేమంతకుమారి, తనుశ్రీ, తేజశ్రీ మృతదేహాలు

పాకాల: భార్యపై అనుమానం.. కుటుంబ కలహాలు.. హతుడికి మానసికరోగం.. వెరసి అబలతోపాటు ఇద్దరు చిన్నారులు బలైపోయారు. మద్దినాయనపల్లి పంచాయతీ పెద్దహరిజనవాడ గ్రామానికి చెందిన గిరి తన అక్క ఇంటి వద్ద ఉన్న భార్యాపిల్లలను తీసుకుని వస్తూ మార్గం మధ్యలోని తన తండ్రి వర్ధంతి సందర్భంగా సమాధి వద్ద పూజలు చేశాడు. అనంతరం అదే దారిలోని బావిలో భార్యా బిడ్డలను తోసి హతమార్చాడు. గిరి తిరుపతిలో ఎలక్ట్రీషియన్ పని చేస్తుండగా అతడి భార్య హేమంతకుమారి(33) లీలామహల్ వద్ద పండ్ల వ్యాపారం చేస్తోంది. వీరికి పెద్ద కుమార్తె తనుశ్రీ(10), రెండవ కుమార్తె తేజశ్రీ(6) పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో గిరి కుటుంబంతో తిరుపతిలోనే జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల కిందట గిరి పులిచెర్ల మండలం ఈ–రామిరెడ్డిగారిపల్లిలోని తన అక్క గారి ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లాడు. అక్కడే మూడు రోజులు గడిపాడు. గురువారం తన తండ్రి వర్ధంతి సందర్భంగా తిరిగి తన స్వగ్రామమైన పెద్దహరిజనవాడకు బయలుదేరాడు. మార్గం మధ్యలోని తన తండ్రి సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశాడు. ఆ తరువాత బయలు దేరి అదే మార్గంలోని కొత్త ఒడ్డిపల్లి గంగనబోయని బావి వద్దకు వారిని తీసుకెళ్లి, భార్యాబిడ్డలను బావిలోకి తోసేశాడు. వారు మరణించారని నిర్ధారించుకున్న తరువాత తాను బావిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయాన్ని నిందితుడు ఆత్మహత్యకు యత్నించే ముందు తన సోదరుడికి ఫోన్‌లో చెప్పడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే తల్లీబిడ్డలు మరణించారు. గిరిని వారు కాపాడి ఆస్పత్రికి తరలించారు. కాగా రెండు మూడు రోజులుగా గిరి మానసిక పరిస్థితి బాగా లేదని అతడి సమీప బంధువులు చెబుతున్నారు. అలాగే కుటుంబ కలహాల కారణంగానే వారిని హత్య చేశారని మృతుల బంధువులు చెబుతున్నారు. బొమ్మల్లాంటి బిడ్డలను హతమార్చడానికి నీకు చేతులు ఎలా ఆడాయిరా నాయనా అని మృతుల బంధులు రోదనలు చూసిన వారి కంటతడి పెట్టిస్తున్నాయి. కాగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

చంద్రగిరి: హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన ఘటన గురువారం చోటు చేసుకుంది. వార్డెన్ వనజ కథనం మేరకు.. పట్టణంలోని ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో తిరుపతికి చెందిన శ్యామ్ నాగరాజు, పీలేరుకు చెందిన గోపిచంద్ స్థానిక ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం గోపిచంద్ స్కూల్‌కు వెళ్లకుండా బయట తిరుగుతుండగా వార్డెన్ వనజ కంటపడ్డాడు. దీంతో స్కూల్‌కు ఎందుకు వెళ్లలేదని ఆమె విద్యార్థినిని ప్రశ్నించారు. క్రమం తప్పకుండా స్కూల్‌కు వెళ్లాలని, ఇలా బయటకు రాకూడదని మందలించారు. ఆపై శ్యామ్ నాగరాజ్ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. చంద్రగిరికి చేరుకున్న శ్యామ్ నాగరాజ్ కుటుంబ సభ్యులు విద్యార్థిని తీవ్రంగా మందలించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో వాచ్‌మెన్ విద్యార్థుల గదులను పరిశీలిస్తుండగా శ్యామ్ నాగరాజ్‌తోపాటు గోపిచంద్ కనిపించకుండా పోయినట్లు గుర్తించి, వార్డెన్‌కు సమాచారం అందించారు. హాస్టల్‌కు చేరుకున్న వార్డెన్ విద్యార్థులు కనిపించపోవడంతో వారి ఆచూకీ కోసం చుట్టుపక్కల అంతా గాలించారు. శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు, నరసింగాపురం రైల్వే స్టేషన్ పరిసరాలను ఆచూకీ కోసం వెతికారు. విద్యార్థులు ఆచూకీ లభించకపోవడంతో వార్డెన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం వార్డెన్ వనజ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు విద్యార్థుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలను చేపట్టారు.

రేపటి నుంచి అభినయ ఆర్ట్స్ జాతీయ నాటకోత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ వారి రజతోత్సవాల్లో భాగంగా ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు మహతి కళాక్షేత్రంలో జాతీయ స్థాయి హనుమ అవార్డ్స్ నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్.రెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభినయ ఆర్ట్స్ 25వ వార్షికోత్సవంలో భాగంగా రజతోత్సవ వేడుకలుగా ఈ జాతీయ స్థాయి నృత్య, నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు రోజు ఉదయం 9.30 నుంచి రాత్రి 9 గంటల వరకు శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటికల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కళాబృందాల చే 8 పౌరాణిక పద్యనాటకాలు, 11 సందేశాత్మకమైన సాంఘిక నాటికలు అద్భుత రీతిలో ప్రదర్శన ఉంటుందన్నారు. ఇందులో గెలుపొందిన వారికి హనుమ అవార్డులతో పాటు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అభినయ ఆర్ట్స్ గౌరవాధ్యక్షుడు ఎస్.విశ్వనాథరెడ్డి, గౌరవ సలహాదారుడు దామోదర గుప్త, ఉపాధ్యక్షుడు ధర్మయ్య పాల్గొన్నారు.